క్లుప్తంగా

నీటి సమస్యకు పరిష్కారం



బోరును పరిశీలిస్తున్న దృశ్యం

మద్దికెర: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పరిసరాలల్లోని కార్యాలయాలకు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎంపీడీఓ ఆఫీసు వద్ద ఎంపీపీ నిధులతో బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడటంతో వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం - ఆంధ్రా పోటీలు



గోనెగండ్లలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గోనెగండ్ల: ఆడుదాం- ఆంధ్రా పోటీలు నాల్గవ రోజు మండలంలో ఉత్సాహంగా కొనసాగాయి. గోనెగండ్లతో పాటు పెద్దనేలటూర్, వేముగోడు గ్రామాల్లోని పాఠశాలల ప్రాంగణాలలో శనివారం మండల స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర: పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే మలేరియా, డెంగీ తదితర వ్యాధులు దరి చేరవని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి అన్నారు. శనివారం దోమల నివారణ మందు పిచికారీ చేయించి, వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమతెరలు వాడాలన్నారు. సాయంత్రం వేపాకు పొగ పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, హెల్త్ సెక్రటరీ అంజలి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు



పేకాట రాయుళ్లను అరెస్టు చూపుతున్న సీఐ హనుమంతప్ప

ఆస్పరి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగరడోనగ్రామంలో శనివారంపేకాట ఆడుతున్న వసంతకుమార్, బసవరాజు, ఈరన్న, బాబు, నల్లన్నలను అరెస్టు చేసినట్లు సీఐ హనుమంతప్ప, ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.21,690 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కప్పట్రాళ్లలో డెంగీ కేసు నమోదు



దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో నాలుగేళ్ల బాలుడికి డెంగీ నిర్ధారణ అయినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. శనివారం గ్రామాన్ని సందర్శించి ఇంటింటికి తిరిగి పరిసరాలను శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. సూపర్‌వైజర్లు రంగస్వామి, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో నిలకడగా నీటి నిల్వలు



హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వలు నిలకడగా ఉన్నాయి. జలాశయం నుంచి అన్ని కాలువలకు వదులుతున్న నీటిని నిలిపివేయడం, వేసవి మొదలు కాకపోవడంతో డ్యాంలో నిల్వలో తేడా కనబడటం లేదు. కొన్ని వారాలుగా 10 టీఎంసీల మేరు నీరు నిల్వ ఉంటోంది. శనివారం 105.788 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి 10.182 టీఎంసీల నిరు నిల్వలున్నాయి.

ఆస్పరి పోలీస్‌స్టేషన్‌కు పదోన్నతి

- బ్రిటీష్ కాలంలో ఏర్పడిన స్టేషన్
- 159 ఏళ్ల క్రితం పోలీస్ క్వార్టర్స్, ఎస్ఐ గది నిర్మాణం
- తాజాగా సీఐ పోస్టు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు



ఆస్పరిలో బ్రిటీష్ కాలం నాటి పోలీస్ స్టేషన్ భవనం



ఎస్ఐకి నిర్మించిన భవనం (దీనిని ప్రస్తుతం తొలగించారు)

ఆస్పరి: స్థానిక పోలీస్‌కు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. సీఐ అధికారిని నియమిస్తూ శాంతిభద్రతలకు పెద్దపీట వేసింది. మండల కేంద్రంలో బ్రిటీష్ కాలం నుంచి పోలీస్‌స్టేషన్ ఉంది. మద్రాస్ గవర్నమెంట్‌లో ఉన్నప్పుడు ఆస్పరి పోలీస్ స్టేషన్ బళ్లారి జిల్లాలో ఉండేది. అప్పట్లో ఆస్పరికి సమీపాన రైల్వే స్టేషన్ నిర్మించారు. కరువు కాటకాలు ఉండడంతో దారి దోపీడీలు, రైళ్లలో వచ్చే ధాన్యాన్ని దుండగులు దొంగలించేవారు. వీటిని అరికట్టేందుకు బ్రిటీష్ అధికారులు 1865లో ఆస్పరి, ములుగుందం గ్రామాల్లో పోలీస్ స్టేషన్లు నిర్మించారు. ఆస్పరిలో పోలీస్ స్టేషన్‌తో పాటు 10 మంది పోలీసులకు, ఎస్ఐకు సరిపడా గదులతో భవనం నిర్మించారు. అప్పట్లో ఎస్ఐలు పోలీస్ స్టేషన్‌కు గుర్రాలపై వచ్చేవారని, అందుకు ఆస్పరిలో గుర్రపు శాల నిర్మించారని చెబుతారు. బాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు ఆస్పరి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో కలిపారు. ఆస్పరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆస్పరితో పాటు చిన్నహోతూరు, జొహరాపురం, శంకరబండ, చిరుమాన్‌దొడ్డి, హలిగేర, బిణిగేరి, చిగిళి, నగరూరు, తంగరడోణ, తురువగల్లు, చొక్కనహళ్లి గ్రామాలు ఉండేవి. 1987లో మండలాలు ఏర్పడినప్పుడు కారుమంచి ఫిర్కాలోని కారుమంచి, కైరుప్పల, ములుగుందం, పలకూరబండ, బవనసూరు, డి.కోటకొండ, బైలుపత్తికొండ, గార్లపెంట, తొగలుగల్లు, దొడగొండ, బిల్లేకల్లు, ముత్తుకూరు, పుటకలమర్రి, వలగొండ, యాటకల్లు, ఐనకల్లు, కలపరి, చెన్నపల్లి, వెంగళాయిదొడ్డి, అట్టికల్లు, ఐనకల్లు గ్రామాలను ఆస్పరి మండలంలో కలిపారు. దీంతో మొదట 12, రెండో సారి 21 కలిపి మొత్తం 33 గ్రామాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఎస్ఐతోనే పాలన సాగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్‌హెచ్‌ఓ నుంచి యూపీఎస్‌కు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో బ్రిటీష్ కాలం నుంచి ఉన్న స్టేషన్‌కు చివరి ఎస్‌హెచ్‌ఓ ఎస్‌గా వరప్రసాద్, యూపీఎస్ మొదటి సీఐగా హనుమంతప్ప రికార్డులకు ఎక్కారు.

శాంతి భద్రతలు కాపాడతాం

మండలంలో శాంతి భద్రతలు కాపాడతాం. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదు. గ్రామాల్లో గొడవలు, ఘర్షణలు లేకుండా ప్రజలు శాంతియుత జీవనం సాగించాలి. 159 ఏళ్ల చరిత్ర ఉన్న స్టేషన్‌కు మొదటి సీఐగా బాధ్యతలు చేపట్టినందుకు సంతోషంగా ఉంది.

– హనుమంతప్ప, ఆస్పరి సీఐ

నేటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆస్పరి: మండల కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం నుంచి మంగళవారం వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామక్రిష్ణ శనివారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20,116, రెండు రూ.10,116, మూడవ బహుమతిగా రూ.5,116 ఇవ్వనున్నట్లు చెప్పారు. పాల్గొనే వారు ఎంట్రీఫీజు ఆదివారమే చెల్లించవచ్చన్నారు.

మంత్రిని కలిసిన ఆస్పరి సీఐ



మంత్రి జయరాంకు బొకే అందజేస్తున్న సీఐ

ఆలూరు: తిరుపతి నుంచి ఆస్పరి పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చిన సీఐ హనుమంతప్ప రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంను శుక్రవారం రాత్రి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రజల హక్కులకు భంగం కలగకుండా శాంతిభద్రతలను కాపాడాలని సీఐకి మంత్రి జయరాం సూచించారు.

మంత్రి మద్దతుతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరూపాక్షి



మాట్లాడుతున్న విరూపాక్షి

ఆలూరు: మంత్రి గుమ్మనూరు జయరాం మద్దతుతో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బూసినేని విరూపాక్షి తెలిపారు. ఇటీవల పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా ప్రకటించిన నేపథ్యంలో శనివారం చిప్పగిరిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను పార్టీకోసం చేసిన సేవలను గుర్తించి మంత్రి గుమ్మనూరు జయరాం జెడ్పీటీసీ సభ్యుడిగా అవకాశమిచ్చారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమన్వయకర్తగా బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. త్వరలోనే అన్ని మండలాల్లో పర్యటించి మండల నాయకులను, కార్యకర్తలను కలిసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరతానన్నారు. గ్రామాల్లో సైతం పర్యటించేందుకు ప్రణాళికను రూపొందించుకుంటున్నానన్నారు. ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించి మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరతానన్నారు. అనంతరం కర్నూలు, కడప జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌నాయుడు, గోపాల్, లక్ష్మికాంతం, మాధవకృష్ణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు విరూపాక్షిని మర్యాద పూర్వకంగా కలిశారు.

నిందితుడిని శిక్షించాలి

ఎమ్మిగనూరు రూరల్: దేవనకొండ మండలం పి.కోటకొండలో ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన మునిరంగడుని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య, మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు గడ్డం నాగేంద్ర డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన మునిరంగడు బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు.

- గోనెగండ్ల: పి.కోటకొండ గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన మునిరంగడుని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ఘటనా ప్రాంతానికి వెళ్లి బాధితులకు భరోసా ఇవ్వాలన్నారు.

ఇంటింటా అక్షింతల పంపిణీ



అయోధ్య అక్షింతను ప్రజలకు అందజేస్తున్న హిందూ ధర్మ ప్రచారకులు

దేవనకొండ: అయోధ్య శ్రీ రాముని అక్షింతలను శనివారం హిందూ ధర్మ ప్రచారకులు కె.ఉచ్చీరప్ప, రఘునాథ్ మండల కేంద్రంలో ఇంటింటా పంపిణీ చేశారు. ఈనెల 22న అయోధ్యలో బాల రాముని ప్రాణప్రతిష్ట చేసిన అనంతరం ప్రతి హిందువు స్థానికంగా ఉన్న రామాలయంలో అక్షింతలు దేవుడికి సమర్పించాలన్నారు. సాయంత్రం ఇంటిలో దేవుని ముందు రెండు దీపాలను, ఇంటి తల వాకిలి గడప ముందు రెండు దీపాలను, తులసి కట్టపై ఒక దీపాన్ని వెలిగించాలని వారు సూచించారు.

గాలి పటాలు జాగ్రత్తగా ఎగురవేయండి

తుగ్గలి: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలు ఎగురవేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని విద్యుత్తుశాఖ మండల ఏఈ మహేశ్వరరెడ్డి సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలు, సెల్‌ఫోన్ టవర్లు ఉన్న చోట గాలి పటాలు ఎగురవేయొద్దన్నారు. విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పడిన పతంగులు తీసే ప్రయత్నం చేయవద్దన్నారు. విద్యుత్ లైన్లు ఉన్న దగ్గర పిల్లలు ఎట్టిపరిస్థితుల్లో గాలి పటాలు ఎగురవేయకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని సూచించారు.

నిరుపయోగంగా పాత పోలీస్‌స్టేషన్ భవనం



నిరుపయోగంగా ఉన్న పాత పోలీస్ స్టేషన్ భవనం

హొళగుంద: స్థానిక పాత పోలీస్ స్టేషన్ భవనం నిరుపయోగంగా ఉంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ భవనం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. కొత్త పోలీస్ స్టేషన్‌ను నిర్మించడంతో పాత భవనం ఖాళీగా మిగిలి పోయింది. ప్రస్తుతం నిరుపయోగంగా మారి చెత్తాచెదారంతో నిండిపోయింది. గ్రంథాలయానికి పక్కా భవనం లేక ప్రైవేట్ భవనానికి నెలకు రూ.2 వేలు అద్దె చెల్లిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత పోలీస్ స్టేషన్ భవనాన్ని గ్రంథాలాయానికి లేదా ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించుకుంటూ ఆర్థిక భారం తగ్గుతుందని పలువురు సూచిస్తున్నారు.

రెండు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

తుగ్గలి: మండల పరిధిలోని ఉప్పర్లపల్లి, రామాపురం గ్రామాల్లో శనివారం అధికారులు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, శివకుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హులందరికీ పథకాలు అందించడమే ప్రభుత్వాల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మినాజ్ పాషా పాల్గొన్నారు.

వైభవంగా సుయమీంద్రతీర్థుల ఆరాధన



సుయమీంద్రతీర్థుల బృందావనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం : మధ్వమత, శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుయమీంద్రతీర్థుల ఆరాధన వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. శ్రీమఠంలో వేడుకను పురస్కరించుకుని రాఘవేంద్రుల, సుయమీంద్రతీర్థుల బృందావనాలకు ప్రత్యేక పూజల చేపట్టారు. నిర్మల్య విసర్జన, పుష్ప, పంచామృతాభిషేకాలు గావించారు. శాస్త్రోక్తంగా విశేష పూజలు చేపట్టి హారతులు పట్టారు. ఈ సందర్భంగా సుయమీంద్రతీర్థులు శ్రీమఠం అభివృద్ధి కోసం చేసిన కృషిని గుర్తు చేశారు. ఆరాధన వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలో శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్, అసిస్టెంట్ పీఆర్వో బిందుస్వామి, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి, బిలేహాల్ అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణులు, బాలింతలకు సరుకులను వీఆర్వో ఆంజనేయులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తలారీలు, వలంటీర్లు ఉన్నారు.

శ్రీమఠం వేడుకల్లో కేంద్ర మంత్రి



పీఠాధిపతి నుంచి జ్ఞాపిక అందుకుంటున్న మంత్రి

మంత్రాలయం: కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కుటుంబ సమేతంగా శనివారం రాత్రి శ్రీమఠంలో జరిగిన రథోత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల చేతుల మీదుగా రాఘవేంద్రుల జ్ఞాపిక ,శేషవస్త్రం, ఫలమంత్రాక్షింతలు అందుకున్నారు. అంతకుముందు గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్రుల మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకుని హారతులు పట్టారు.

శ్రీమఠంలో మున్సిపల్ కార్పొరేషన్ జేడీ



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న సుబ్బారావు

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం ఏపీ మున్సిపల్ కార్పొరేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి సుబ్బారావు కుటుంబ సమేతంగా శనివారం మంత్రాలయం విచ్చేశారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు నేతృత్వంలో వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. రాత్రి రాఘవేంద్రుల ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీమఠం ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ ఉన్నారు.

పంటలు నమోదు చేసుకోండి

హాలహర్వి: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈ నెల చివరిలోపు నమోదు చేయించుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పంటల నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారం, సబ్సిడీ ఎరువులు, పంటలకు గిట్టుబాటు ధర తదితర వాటికి అర్హులవుతారన్నారు.

హత్య కేసులో 13 మంది నిందితుల అరెస్ట్

ఎమ్మిగనూరు రూరల్: పట్టణానికి చెందిన ఓ యువకుడి మృతికి కారణమైన 13 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వివరాలను శనివారం రాత్రి టౌన్ సీఐ మధుసూదన్‌రావు విలేకరులకు వెల్లడించారు. డిసెంబర్ 31 రాత్రి నూతన సంవత్సర వేడుకల సందర్భంగా పట్టణంలోని లక్ష్మీపేటకు చెందిన మహబూబ్(23) స్నేహితులు బైక్‌లపై పెద్దగా శబ్దం చేస్తూ చక్కర్లు కొడుతుండగా అదే కాలనీకి చెందిన బాలాజీ అడ్డు చెప్పడంతో అతడిపై దాడి చేశారు. దీంతో బాలాజీ తన స్నేహితులను రప్పించుకుని మహబూబ్ స్నేహితులపై దాడికి దిగారు. ఈక్రమంలో మహబూబ్ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతిచెందాడు. తండ్రి చాంద్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను గుర్తించి గాలింపు చేపట్టారు. ఉప్పరి కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ధర్మపురం రాజు, వెంకటాపురం వెకంటేష్, ధర్మపురం చరణ్, సూగూర్ హోమ్‌దీప్, గోపాల్‌గౌడ్, కొమ్ము రాజశేఖర్, గొల్ల బాలాజీ, వడ్డే పవన్‌కళ్యాణ్, బోయ కారుమంచి ఉరుకుందు, ఉప్పర యశ్వంత్‌కుమార్, ఉప్పర ముగతి భీమతో పాటు మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల్లోని 11 మందిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారని, మరో ఇద్దరు మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

సీఐ బాధ్యతల స్వీకరణ



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

దేవనకొండ: దేవనకొండ మండల పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో సీఐగా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

ఆదోనిఅర్బన్: మండలంలోని కుప్పగల్ గ్రామానికి చెందిన జగదీష్, లక్ష్మి దంపతుల మూడేళ్ల కుమారుడు నందకిషోర్ కాలిపై ఆదోని నుంచి ఉరుకుంద వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎక్కడంతో తీవ్ర గాయాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు కాలుపై ఎక్కిందని బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలకు గుర్తింపునిచ్చిన నేత సీఎం జగనన్న



మాచాని వెంకటేష్‌ను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

- ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే వైఎస్ఆర్‌సీ పార్టీతోనే బీసీలకు అత్యంత ప్రాధాన్యతనివ్వడం జరిగిందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కుర్ణి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మాచాని వెంకటేష్‌ను మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సీపీ శ్రేణులకు పరిచయం చేసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు ఎమ్మెల్యే సీట్లు కేటాయిస్తూ బీసీలకు రాజకీయంగా అవకాశం కల్పిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందిందన్నారు. ఆయా సంక్షేమ పథకాలే మరోసారి సీఎంగా వైఎస్ జగన్ సారథ్యంలో వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రానుందని, ఇందుకోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో కూడా పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, ఎంపీపీ కేశన్న, వైస్ ఎంపీపీ పోలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి

కృష్ణగిరి: సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రశేఖరరెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. భోగి పండుగ సందర్భంగా గ్రామాల్లో పిల్లలు పతంగులను ఖాళీ ప్రదేశాలు, మైదానాలలో ఎగురవేసేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. మిద్దెలపై నుంచి ఎగురవేస్తున్నప్పుడు ఒక దాన్ని మరో మిద్దెపైకి ఎగురడం వంటివి చేయకూడదని, గాలి పటాలు విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లపై పడితే తీసుకునే ప్రయత్నం చేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

20 నుంచి చేనేత కార్మిక మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్: ఈనెల 20, 21వ తేదీల్లో మంగళగిరిలో ఏపీ చేనేత కార్మిక సంఘ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీ చేనేత కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి మాధవ స్వామి తెలిపారు. శనివారం సీపీఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభలకు చేనేత కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ముత్తన్న (ఫైల్)

కోసిగి: మండలంలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన కురువ ముత్తన్న (32) తన గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు. ముత్తన్నకు పదేళ్ల క్రితం ఆర్లబండ గ్రామానికి చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. పెళ్లి చేసుకున్న నాటి నుంచి భార్య సరిగా కాపురానికి వచ్చేది కాదని, పలు మార్లు పెద్ద సమక్షంలో పంచాయితీ చేసి ఒప్పించినా కొన్నాళ్లు ఉండి మళ్లీ పుట్టినింటికి వెళ్లిపోయేదన్నారు. దీంతో ముత్తన్న తాగుడుకు బానిసై భార్య, భర్త తరుచూ గొడవ పడేవారన్నారు. రెండు నెలల క్రితం భర్త వేధిస్తున్నాడంటూ కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రెండు నెలలుగా గ్రామం నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం ముత్తన్న పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. రాత్రికి గ్రామానికి చేరుకుని భార్య రాకపోవడం, పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లడంతో మనస్థాపానికి గురై తన గుడిసెలో తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం మృతుడి మేనల్లుడు వెళ్లి చూడగా ఉరికి వేళాడుతూ కనిపించాడు. ముత్తన్న మృతికి భార్య, ఆమె కుటుంబ సభ్యులే కారణమని మృతుడి అక్కలు శివలింగమ్మ, ఈరమ్మ, జలాలమ్మ ఆరోపించారు. కోసిగి పోలీసులు గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

19 నుంచి చెన్నంపల్లిలో శవాసప్పతాత ఉరుసు

తుగ్గలి: మండల పరిధిలోని చెన్నంపల్లిలో ఈనెల 19 నుంచి శవాసప్పతాత ఉరుసు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న గంధం, 20న షంషీర్, 21 జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు.